క్లుప్తంగా

మాదక ద్రవ్యాలపై అవగాహన



బీబీపేట: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్సై దీపిక హాజరై మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్లు మోహిన్, ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్నూర్(జుక్కల్): ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని బిచ్కుంద ఎక్సైజ్ ఎస్సై నాగేశ్ సూచించారు. మద్నూర్, డోంగ్లీ మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ఆయన ఎక్సైజ్ సిబ్బందితో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు.

వాహనాల తనిఖీ



మద్నూర్(జుక్కల్): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని సలాబత్‌పూర్ వద్ద జాతీయ రహదారిపై ఎస్సై విజయ్ కొండ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. పెండింగ్ చలాన్లు ఉంటే వారితో డబ్బులు కట్టించారు. ట్రాఫిక్ నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బ్రాహ్మణపల్లిలో గ్రామసభ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రాహ్మణపల్లిలో సోమవారం ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ కార్యక్రమంపై అధికారులు గ్రామసభను నిర్వహించారు. 2024–25లో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేసిన పనులను చదివి వినిపించారు. కార్యక్రమంలో గ్రామప్రత్యేక అధికారి నర్సింలు, గ్రామ కార్యదర్శి వీరేష్, ఫీల్డు అసిస్టెంటు చిరంజీవి, డీఆర్పీలు, కూలీలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



బాన్సువాడ: ఎస్‌బీఐ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎంవో సుజాత మాట్లాడుతూ.. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బందికి ప్రత్యేక అభినందనలని అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్యాంక్ మేనేజర్ సునీల్, ఫీల్డ్ ఆఫీసర్ శంకర్‌గౌడ్, పీఆర్వో ఆనంద్, ల్యాబ్ టెక్నీషియన్లు రాఘవేందర్, సూర్యకాంత్, శ్రీనివాస్, బ్యాంకు సిబ్బంది శ్రీనివాస్‌చౌదరి, మహిపాల్, కృష్ణస్వామి, మోహన్‌రావు, భరత్ తదితరులు ఉన్నారు.

50 వేల యూనిట్ల రక్త సేకరణే ఐవీఎఫ్ లక్ష్యం

కామారెడ్డి అర్బన్: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) వ్యవస్థాపక దినోత్సవం, 12వ వార్షికోత్సవం సందర్భంగా జూలై 6న తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం 50 వేల యూనిట్ల రక్తం సేకరణ లక్ష్యంతో దేశ వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్టు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు తెలిపారు. జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్ సూచన మేరకు జాతీయ స్థాయిలో రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్టు బాలు పేర్కొన్నారు.

టీజీవీపీకి ఎలాంటి సంబంధం లేదు

కామారెడ్డి టౌన్: తెలంగాణ విద్యార్థి పరిషత్(టీజీవీపీ)కు లింగంపేట మండలానికి చెందిన అల్లూరికి ఎలాంటి సంబంధం లేదని జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర కమిటీ ఎలాంటి బాధ్యతలను ఇవ్వకున్నా సంఘం పేరుతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలను బెదిరింపులకు పాల్పడుతున్న అల్లూరికి టీజీవీపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సంఘం నుంచి అల్లూరిని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు.

కంప్యూటర్ల కోసం విరాళం



నిజాంసాగర్(జుక్కల్):మహమ్మద్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ల కొనుగోళ్లకు సోమవారం పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కలకొండ నారాయణ ఆధ్వర్యంలో నగదును విరాళంగా అందజేశారు. ఆ పాఠశాలలో కంప్యూటర్లు లేక ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న నాయకులు తమ వంతుగా ముందుకు వచ్చిన నగదును విరాళంగా అందజేశారు. నాయకులు వెంకటరమణ, వెంకట్రాంరెడ్డి, పండరి, హెచ్ఎం మదుసూధన్ రాజ్, ఉపాధ్యాయులు భోజన్న, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్లకు మోక్షమెప్పుడో?

- తండావాసులకు తప్పని ఇబ్బందులు
- పలుచోట్ల అర్ధంతరంగా నిలిచిన పనులు
- వర్షాకాలంలో పెరగనున్న తిప్పలు
- బీటీ రోడ్లు వేయాలని తండావాసుల విజ్ఞప్తి



ఎల్లారెడ్డిపల్లి తండా. శేర్‌శంకర్ తండా గ్రామాల మధ్య రోడ్డు

రాజంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పల్లె, తండా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో 2018 ఆగస్టు 2న నూతన జీపీలకు శ్రీకారం చుట్టింది. ప్రతి గ్రామం, పల్లె, తండాలు జీపీలుగా చేయడంతో వాటికి ప్రత్యేక బడ్జెట్, ఆర్థిక వనరులు ఏర్పడటంతో అభివృద్ధి చెందుతాయని ఆశించినా పలు తండాలు అటవీ శాఖ పరిధిలలో ఉండటంతో అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. రాజంపేట మండలంలోని ఎల్లారెడ్డిపల్లి నుంచి శేర్ శంకర్ తండా వరకు బీటీ రోడ్డు మంజూరైనప్పటికీ అటవీశాఖ పరిధిలో ఉందని పనులు అర్ధంతరంగా వదిలేశారు. ఎల్లాపూర్ తండా, కొండాపూర్ పరిధిలోని కొతిమీర్ తండాలలో ఇదే పరిస్థితి ఉంది. తండాలకు బీటీ రోడ్ల విషయమై స్థానిక తండావాసులు గతంలో ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయి ఫారెస్ట్ అధికారులకు స్వయంగా కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని తండావాసులు చెబుతున్నారు. దీంతో ఎల్లారెడ్డిపల్లి నుంచి ఎల్లారెడ్డిపల్లి తండా వరకు మాత్రమే బీటీ రోడ్డు పనులు జరిగాయి. ఎల్లారెడ్డిపల్లి నుంచి శేర్ శంకర్ తండా వరకు బీటీ రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఇక్కడ ఫారెస్ట్ అధికారులు అభ్యంతరం తెలపడంతో పనులు నిలిచిపోయినట్లు తండావాసులు చెబుతున్నారు.

వానొస్తే బురదమయమే..

మండలంలోని పలుతండాలకు బీటీ రోడ్లు లేకపోవడంతో తండావాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం అయితే వీరి బాధలు వర్ణాతీతం. రోడ్లు బురదమయం కావడమే కాకుండా రోడ్డు మరింత గుంతలకు గురై ప్రమాదాలకు దారితీస్తుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు తండాలకు బీటీ రోడ్డు వేసి తమ సమస్యను పరిష్కరించాలని తండాల ప్రజలు కోరుతున్నారు.

వర్షాకాలంలో ప్రయాణం సాహసమే



తండాలకు బీటీ రోడ్డు వేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి. వర్షాకాలంలో తండాల రోడ్డు బురదమయంగా మారుతున్నాయి. అదే విధంగా రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో ప్రయాణం చేయాలంటే సాహసం చేసినట్లే అవుతోంది. శేర్‌శంక్ తండా, ఎల్లారెడ్డిపల్లి తండా గ్రామాల మధ్య బీటీ రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలి.

–కాట్రోత్ చందర్, శేర్‌శంకర్ తండా

నేటి చిత్రం

దుర్గంధాన్ని తొలగించండి..!



సదాశివనగర్ గ్రంథాలయం వద్ద నిలిచిన మురికినీరు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సదాశివనగర్ గ్రంథాలయం వద్ద డ్రైనేజీ సక్రమంగా లేకపోవడం వల్ల మురికినీరు పేరుకుపోతోంది. దీనివల్ల గ్రంథాలయానికి వచ్చే పాఠకులు దుర్గంధం భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయం పక్కనే ఉన్న బ్యాంకుకు వచ్చే ఖాతాదారులు సైతం డ్రెయినేజీ నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీని శుభ్రం చేయించాలి.

– స్వామి, సదాశివనగర్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200 | ఎల్లారెడ్డి : 97053 46576 | బాన్సువాడ : 94402 11363 | జుక్కల్ : 97053 46578

ప్రైవేట్ స్కూళ్లపై విచారణ చేపట్టాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కామారెడ్డి టౌన్: జిల్లా వ్యాప్తంగా నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్లపై విచారణ చేపట్టాలని కోరుతూ సోమవారం డీఈవో ఎస్.రాజుకు ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనుమతులు లేకుండా, కనీస మౌలిక వసతులు లేకుండా స్కూళ్లు కొనసాగుతున్నాయన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు అసిఫ్, సురేష్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వ పాఠశాలలకు రంగులు



రంగులు వేసిన తర్వాత ఎర్రాపహాడ్ జెడ్పీహెచ్ఎస్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ చొరవతో ఎర్రాపహాడ్‌లోని మూడు ప్రభుత్వ పాఠశాలలకు రంగులు వేస్తున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన కార్యాలయాలు, తరగతి గదులకు రంగులు వేయక పోవడంతో గదులు కళా విహీనంగా కనిపించేవి. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే స్పందించి రూ.12 లక్షల కేటాయించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు, ఉపాధ్యాయులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



ఎల్లారెడ్డిలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



తాడ్వాయిలో..

సాక్షి నెట్‌వర్క్ : జన్‌సంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భారతదేశ ఐక్యత, సమగ్రతను కాపాడే దిశగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన పోరాటం ప్రతి భారతీయుడికి ప్రేరణాత్మకమని కొనియాడారు. స్వాతంత్య్రం అనంతరం భారతదేశంలో జాతీయ రాజకీయాలను ముందుకు నడిపేందుకు ఆర్ఎస్ఎస్ సహకారంతో జన్‌సంఘ్‌ను స్థాపించి ఎందరికో మార్గనిర్దేశం చేశారని పేర్కొన్నారు.



కల్వరాల్‌లో మొక్కలు నాటుతూ..



బీబీపేటలో..



పిట్లంలో ..



లింగంపేటలో ..

ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనుల పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి):మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులను సోమవారం హౌసింగ్ డీఈఈ సుభాష్ పరిశీలించారు. పనులను వేగవంతం చేసి మోడల్ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎంపీడీవో ప్రభాకరచారి, హౌసింగ్ ఏఈ సందీప్ ఉన్నారు.

ధ్రువీకరణ పత్రాల పంపిణీ



భిక్కనూరులో మంజూరు పత్రం అందిస్తున్న నేతలు

భిక్కనూరు: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను మాజీ ఎంపీపీ బల్యాల రేఖ సుదర్శన్ పంపిణీ చేశారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, నేతలు దుంపల మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మద్దురి రవి, నర్మల రాంచంద్రం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్ధరాములు, ఈవో మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

తాడ్వాయిలో ..

తాడ్వాయి(ఎల్లారెడ్డి):మండల కేంద్రంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ మాట్లాడుతూ.. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు.

భారంగా మారిన మున్సిపల్ నిర్వహణ

- ప్రారంభం కాని లావాదేవీలు
- మరమ్మతులకు నోచుకోని బోరు మోటర్లు
- ముగిసిన జీపీల పాలన
- సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలం



బిచ్కుంద మున్సిపల్ కార్యాలయం



కార్యాలయంలో కాలిపోయిన మోటార్లు

బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వం బిచ్కుందను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి గోపన్‌పల్లి, దౌల్తాపూర్, కందర్‌పల్లి గ్రామాలను బిచ్కుంద మున్సిపాలిటీలో విలీనం చేస్తు అప్‌గ్రేడ్ చేసింది. మున్సిపల్ శాఖ అధికారులు జీపీ రికార్డులు స్వాధీనం చేసుకొని మే 30న మున్సిపల్ కమిషనర్‌గా ఖయ్యుంకు బాధ్యతలు అప్పగించారు. నాటి నుంచి జీపీ పాలన ముగిసిపోయింది. కొత్తగా మున్సిపల్ పాలన ప్రారంభమైంది. కమిషనర్ రావడంతో నాలుగు జీపీలకు సంబంధించిన పన్నులు ఇతర లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి. వెంటనే మున్సిపల్ కార్యాలయానికి సబంధించిన బ్యాంక్ అకౌంట్ తెరవాల్సి ఉండగా అధికారులు కాలక్షేపం చేస్తున్నారు. రూ.15 కోట్లు నిధులు వచ్చాయని అధికారులు ప్రకటన చేశారు. బ్యాంక్ అకౌంట్ లేకపోవడంతో వచ్చిన నిధులు జమకాలేదని తెలిసింది. మున్సిపల్ పాలన ప్రారంభమై 25 రోజులు అవుతున్నా పన్నుల వసూళ్లు ఇతర లావాదేవీలు ప్రారంభం కాలేదు. చేతిలో చిల్లి గవ్వ లేదు. సింగిల్ ఫేజ్ మోటార్లు కాలిపోతున్నాయి. ఇతర సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ పాలన అధికారులకు భారంగా మారింది.

ఒకే ఒక్కడు..

మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు బిచ్కుంద కొత్త మున్సిపాలిటీకి ఒకే ఒక కమిషనర్‌ను నియమించి చేతులు దులుపుకున్నారు. జీపీ పాలన ముగియడంతో జీపీ సిబ్బంది మున్సిపల్ కార్యాలయంలో అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. ఒకే ఒక్క అధికారి ఉండడంతో ప్రజల సమస్యలు పరిష్కరించడం తలకు మించిన భారంగా మారింది. జనన, మరణ, ఓనర్‌షిప్ సర్టిఫికెట్, కొత్తగా కరెంటు మీటరు, ఇంటి నంబరు, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇంటి పన్నులు కట్టడానికి వచ్చిన ప్రజల నుంచి పన్ను తీసుకోవడం లేదు. మున్సిపల్ పేరుతో బిల్లు బుక్‌లు, అకౌంట్, స్టాంపులు లేకపోవడంతో ప్రజల పనులకు ఆటంకం ఏర్పడుతోంది.

77 ఏళ్లు జీపీగా సేవలు..

బిచ్కుంద గ్రామ పంచాయతీ 1948లో పంచాయతి సమితిగా ఆవిర్భవించింది అభివృద్ధిలో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ 77 ఏళ్ల గ్రామ పంచాయతీగా బిచ్కుంద ప్రజలకు అరకొర మౌలిక సదుపాయాలు కల్పిస్తూ సేవలు అందించింది. 16 వార్డులు, 4 ఎంపీటీసీ స్థానాలు ఉండేవి. బిచ్కుంద, జుక్కల్, మద్నూర్ మండలాలు మహారాష్ట్రలో ఉండేవి. రాష్ట్రాల విభజనలో భాగంగా 1958లో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో విలీనం చేశారు. ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలో ఉన్నాయి.

సనాతన హిందూ ధర్మరక్షణ కోసం పాదయాత్ర



స్వామీజీతో వీహెచ్‌పీ, గణపతి ఆశ్రమం ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: సనాతన హిందూ ధర్మరక్షణ, విశ్వశాంతి, సమాజాభివృద్ధి ఆకాంక్షిస్తూ తాను పాదయాత్ర చేస్తూ ప్రచారం చేస్తున్నట్టు కర్నాటక రాష్ట్రం ఉడిపికి చెందిన లక్ష్మీపతి స్వామీజీ అన్నారు. సోమవారం లక్ష్మీపతి స్వామీజీ పాదయాత్ర తిరుగు ప్రయాణంలో కామారెడ్డికి చేరుకున్న సందర్భంగా రామేశ్వరపల్లి గణపతి సచ్చిదానంద ఆశ్రమ ప్రతినిధులు, విశ్వహిందూ పరిషత్ నేతలు స్వాగతం పలికారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.నిత్యానందం, బొల్లిరాజు, బి.గోపాలకృష్ణ, ప్రచార ప్రముఖ్ జి.శ్రీకాంత్‌రావు, గణపతి ఆశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

దోమకొండ: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యులు రవీందర్ ఆధ్వర్యంలో 26 మందికి కంటి పరీక్షలు చేసి మందులను అందజేసినట్లు ఆయన వివరించారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు విజయ, వైద్య సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ స్థలాన్ని స్వాధీనం చేసుకోండి



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని టీచర్స్ కాలనీలో కబ్జాకు గురైన 10 శాతం మున్సిపల్ స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకోవాలని సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజుకు బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేసుకున్నాడని, వెంటనే విచారణ చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. అలాగే కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సూచించారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. బీజేపీ నాయకులు ప్రకాష్‌పటేల్, లక్ష్మీనారాయణ, శంకర్‌గౌడ్, కోనాల గంగారెడ్డి, సాయికిరణ్, హరి, చిరంజీవి, మహేష్, సాయి, తదితరులున్నారు.

గ్రామ సంఘ పదాధికారులకు శిక్షణ



రాజంపేట: మండల సమాఖ్యలో నూతనంగా ఎన్నికైన పదాధికారులకు సోమవారం స్థానిక రైతు వేదిక భవనంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీపీఎం ఐబీ సుధాకర్ హాజరై మాట్లాడారు. గ్రామ సంఘ సభ్యులు చేయవలసిన బాధ్యతలు, విధుల గురించి నూతన పదాధికారులకు అవగాహన కల్పించారు. ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలన్నారు. బ్యాంకు లింకేజీ, ఎంటర్‌ప్రైజెస్, స్త్రీనిధి గురించి సంఘ సభ్యులతో చర్చించారు. శిక్షకులు సంగీత, పుష్పలత, సీసీలు శ్రీనివాస్, సాయిలు, భాగయ్య, రమేష్, స్వామి, అకౌంటెంట్ ప్రశాంతి పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..?



పెద్దకొడప్‌గల్(జుక్కల్): వడ్లం గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఓ ఇంటి ప్రహరీకి ఆనుకొని ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో జనం రద్దీ కూడా ఎక్కువగా ఉంటుంది. ఆవులు, గేదెలు లాంటివి పొరపాటున ముట్టుకున్నా కరెంటు షాక్ కొట్టే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ కోసం గద్దె ఏర్పాటు చేసి చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్తం

వానలు కురవాలని పూజలు

భిక్కనూరు: వానలు కురిపించు సిద్దరామేశ్వర అంటూ భిక్కనూరు మండలం గుర్జకుంట రైతులు ఆదివారం సిద్దరామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భాజభజంత్రీలతో వేకువజాముననే నీటి బిందెలతో తరలి వచ్చి అభిషేకించారు. వర్షాలు కురిపించి పంటలు బాగా పండేలా చూడుమని స్వామివారిని వేడుకున్నారు. ముడుపులు కట్టారు.

ఆర్థిక సహాయం

ఎల్లారెడ్డిరూరల్: తిమ్మాపూర్ తండాకు చెందిన నేనావత్ రవి మృతి చెందడంతో ఆయన కుటుంబానికి మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ సోమవారం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

ఎల్లారెడ్డిరూరల్: సబ్దల్‌పూర్‌లో విద్యార్థులకు గ్రామానికి చెందిన నాయికోటి చందు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. అలాగే మల్లయ్యపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన తోట దత్తు నోటు బుక్కులు, పెన్నులు, పెన్సిల్స్ అందించారు.

ఉచిత కంది విత్తనాలు..

గాంధారి(ఎల్లారెడ్డి): ఈ ఖరీఫ్‌లో వర్షాలు ముందే రావడంతో మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఖరీఫ్ పంటల సాగును ముందే ప్రారంభించారు. సోయాబీన్, పత్తి, మొక్కజొన్న, కంది విత్తడం పూర్తయింది. విత్తనాలు కూడా బాగానే మొలకలొచ్చాయి. రైతులు సొంత డబ్బులతో అన్ని రకాల విత్తనాలు తెచ్చుకున్నారు. విత్తడం ముగిశాక సోమవారం ఏవో రాజలింగం రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేశారు. మొత్తం 600 బస్తాల కంది విత్తనాలు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఏవో తెలిపారు.

వార్డెన్, ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి

కామారెడ్డి టౌన్: తాడ్వాయి మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల వార్డెన్, ప్రిన్సిపల్‌లను సస్పెండ్ చేయాలని బహుజన డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వడ్ల సాయికృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ నెల 20న విద్యార్థులు, తల్లిదండ్రులు ఆలస్యంగా వచ్చారని లోపలికి రాకుండా గేటుకు తాళం వేసి నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

తాగు నీటి సమస్యకు పరిష్కారం



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం నర్వ గ్రామ గంగపుత్ర కాలనీలో తాగునీటి ఎద్దడి నివారణకు సోమవారం బోరుబావి తవ్వకం పనులు ప్రారంభించారు. తమ కాలనీలో ఉన్న నీటి సమస్యను స్థానికులు బీజేపీ రాష్ట్ర నేత పైడి ఎల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన బోరుబావి తవ్వకంతో పాటు బోరు మోటార్ ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులకు సూచించారు. ఈ మేరకు కాలనీలో బోరుబావి తవ్వకం చేపట్టారు. రెండు, మూడు రోజుల్లో బోరు మోటార్‌ను బిగించి నీటి సమస్యను తీరుస్తామని బీజేపీ నాయకులు రాంప్రసాద్‌గుప్తా, రాములు తెలిపారు.